సాక్షి
నల్లగొండ
శుక్రవారం ၊ 1 ၊ సెప్టెంబర్ ၊ 2023



అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

అంతర్రాష్ట్ర దొంగను కోదాడ పోలీసులు అరెస్టు చేసి రూ.7.50లక్షలు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



ఐదుగురికి గాయాలు

కారు, పాల వ్యాన్ ఢీకొని ఐదుగురికి గాయాలైన ఘటన పీఏ పల్లి మండలంలో గురువారం చోటు చేసుకుంది. - 8లో



విజయవంతం చేయాలి

శుక్రవారం నుంచి చేపట్టిన నిరసనలను విజయవంతం చేయాలని సీపీఎం నేత రంగారెడ్డి పిలుపునిచ్చారు. - 10లో

న్యూస్‌రీల్

గ్రామ పంచాయతీగా కట్టవారిగూడెం

గుర్రంపోడు: మండలంలోని కట్టవారిగూడెం గ్రామం గ్రామ పంచాయతీగా ఏర్పాటు కానుంది. గ్రామ పంచాయతీ ఉత్తర్వులు లాంఛనమేనని, ఈ మేరకు జిల్లా పంచాయతీ కార్యాలయం తనకు సమాచారం ఇచ్చినట్టు గ్రామ సర్పంచ్ చాడ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం చామలేడు గ్రామ పంచాయతీ పరిధిలోని కట్టవారిగూడెంలో గ్రామ పంచాయతీకి కావాల్సిన జనాభా 500కు మించి 760 జనాభా ఉంది. నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారిపై ఉండడం.. గ్రామ పంచాయతీ కార్యాలయం ఇతర భవన నిర్మాణాలకు గ్రామకంతం భూమి కలిగి ఉండడం.. ఇతర ఆదాయ వనరులతో ప్రతిపాదనలు పంపించడంతో ఆమోదం లభించినట్టు పేర్కొన్నారు.

యూరియా తిప్పలు



ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

మునుగోడు: రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి పంటలు జీవం పోసుకున్నాయి. ముఖ్యంగా పత్తి, వరి చేలకు యూరియా చల్లే అదును వచ్చింది. అయితే మునుగోడు మండలంలో దాదాపు 20కిపైగా ఎరువుల దుకాణాలు ఉన్నా కొన్నింటికే అరకొరగా యూరియా సరఫరా చేస్తుండడంతో రైతులందరికీ సరిపోవడం లేదు. దీంతో రైతులు నిత్యం ఆయా దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బారులుదీరుతున్నా సరిపడా యూరియా అందని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు యూరియా కొరత లేకుండా సరిపడా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

2, 3 తేదీల్లో రాష్ట్ర స్థాయి చెస్ సెలక్షన్స్



బ్రోచర్స్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సూర్యాపేట టౌన్: జిల్లా చెస్ అసోసియేసన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ ఆధ్వర్యంలో ఈ నెల 2, 3వ తేదీల్లో రాష్ట్ర స్థాయి చెస్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో చెస్ సెలక్షన్స్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అండర్ 19 బాలబాలికల కోసం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో ఈ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారిని గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగే నేషనల్ సెలక్షన్స్‌కు పంపించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని చెస్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 8555008996ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్, కార్యదర్శి ఎల్.సతీష్‌కుమార్, బాప్‌సింగ్, శ్రీనివాస్, వీరయ్య, ఫణి, సతీష్, రమేష్, డాక్టర్ రమేష్‌నాయక్, రషీద్, నాగరాజు, శ్రీనివాస్, శ్రీధర్, భిక్షం పాల్గొన్నారు.

యాదాద్రిలో శ్రావణ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: శ్రావణమాసం, రాఖీపౌర్ణమిని పురస్కరించుకొని గురువారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో విశేష పూజలు చేపట్టారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ప్రధానాలయం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలు గావించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, సహస్ర నామార్చన గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.14,01,617 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

• కలెక్టర్‌కు రాఖీ కట్టిన ఉద్యోగులు



రక్షాబంధన్‌ను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్‌కు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణితో పాటు పలువురు మహిళా అధికారులు, సిబ్బంది రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. - నల్లగొండ

ఐటీఐ అడ్మిషన్ల గడువు పెంపు

రామగిరి(నల్లగొండ): ఐటీఐలో మూడవ విడత అడ్మిషన్ల గడువు పొడిగించినట్లు నల్లగొండ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరాలనికి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలనందు ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 2వ తేదీ వరకు గడువు పొడింగించినట్లు పేర్కొన్నారు. నిర్ణీత గడువు లోపు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

27 వేలు తిరస్కరణ

'గృహలక్ష్మి' దరఖాస్తుల్లో సరైన పత్రాల్లేవని అధికారుల నిరాకరణ

- తుది దశకు చేరిన అర్జీల పరిశీలన
- నేటితో ముగియనున్న ప్రక్రియ
- రెండో వారంలో నిధులు మంజూరయ్యే అవకాశం



'గృహలక్ష్మి' వివరాలు

వచ్చిన దరఖాస్తులు	78,890
పరిశీలించినవి	77,500
అర్హత ఉన్నవి	50,500
పరిశీలించాల్సినవి	1,390

నల్లగొండ: జిల్లాలో గృహలక్ష్మి పథకానికి అందిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం తుది దశకు చేరుకుంది. ఈ ప్రక్రియ ఇరవై రోజుల నుంచి కొనసాగుతోంది. అయితే గ్రామాల్లో ఎంపీడీఓలు ఇన్‌చార్జ్‌లుగా పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో మున్సిల్ కమిషనర్లకు అప్పగించగా మున్సిపల్ సిబ్బంది పరిశీలిస్తున్నారు. అయితే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ శుక్రవారంతో పూర్తి కానుందని అధికారులు పేర్కొంటున్నారు.

పెద్ద ఎత్తున దరఖాస్తులు..

గృహలక్ష్మి పథకానికి ప్రభుత్వం రూ.3లక్షల ఆర్థిక సాయం అందిస్తామనడంతో ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ చైర్మన్ ఓ కమిటీని నియమించారు. జిల్లా వ్యాప్తంగా 78,890 మంది దరఖాస్తు చేసుకున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో మున్సిపల్ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి దరఖాస్తులు దారులు అర్హులా కాదా అని తేల్చుతున్నారు. అయితే ప్రభుత్వం మహిళల పేరుమీద ఇంటి స్థలం ఉంటేనే గృహలక్ష్మి పథకానికి అర్హులని చెప్పడంతో భర్తల పేరు మీద ఉన్న ఇళ్లను చాలా మంది భార్యల పేరు మీదికి మార్చి పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.

అర్హత ఉన్నవిగా తేల్చినవి 50వేలపైనే..

ఇప్పటి వరకు గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించగా అందులో ఇప్పటివరకు 50,500 దరఖాస్తుదారులను అర్హులుగా తేల్చారు. ఇందులో 27 వేల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. చాలా మంది అర్హత లేని వారు, అన్ని సర్టిఫికెట్లు పెట్టకుండా దరఖాస్తు చేసుకున్నారు. రేషన్ కార్డులు లేకుండానే దరఖాస్తు చేసుకోవడం వంటి వాటితో వేలాది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. సెప్టెంబర్ రెండో వారంలో ఈ పథకానికి సంబంధించి నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది.

అర్హులను పారదర్శకంగా ఎంపిక చేయాలి

కనగల్: గృహలక్ష్మి పథకానికి చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. గృహలక్ష్మికి దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల సర్టిఫికెట్లతో పాటు ఆన్‌లైన్ చేసే విధానాన్ని శుక్రవారం కనగల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై పథకం వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు మండలంలోని శేరిలింగోటం గ్రామానికి వెళ్లి గృహలక్ష్మి దరఖాస్తుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని మంజుల అనే గృహిణిని అర్హురాలిగా గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే మంజులకు మొట్టమొదటి ప్రొసిడింగ్ మంజూరు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే అర్హులందరికీ ప్రొసీడింగ్ అందజేస్తామన్నారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీపీ కరీంపాషా, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎంపీఓ ముజివుద్దీన్, కనగల్ పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవ రెడ్డి, డీటీ తబిత, ఆర్ఐ మర్రి యాదగిరి సర్పంచ్ ఆవురేశి క్రాంతిశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి



సమీక్షలో మాట్లాడుతున్న తరుణ్‌చుగ్, చిత్రంలో రాజగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు

- టికెట్ ఎవరికి ఇచ్చినా సమన్వయంతో విజయానికి పాటుపడాలి
- నియోజకవర్గాల వారి సమీక్షలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్

నల్లగొండ టూటౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడింది.. టికెట్ ఎవరికి వచ్చినా నాయకులంతా సమన్వయంతో ముందుకు పోవాలి.. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ సూచించారు. గురువారం నల్లగొండలో జిల్లాలోని నాగార్జునసాగర్, మునుగోడు, దేవరకొండ, మిర్యాలగూడ, ఆలేరు, భువనగిరి అసెంబ్లీ నియోజవర్గాల వారీగా మండల అధ్యక్షులు, వివిధ పదవుల్లో ఉన్న ముఖ్య నాయకులతో తరుణ్‌చుగ్ సమీక్షించారు. రానున్న ఎన్నికలకు ఎలా సిద్ధ కావాలనే విషయంపై నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బూత్ కమిటీలు లేని చోట కొత్తగా నియమించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఇచ్చిన అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేలా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పినట్లు తెలిసింది. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి పార్టీ వైపు ఆకర్షితులయ్యేలా చొరవ తీసుకువాలనే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకురాలు బంగారు శృతి, గోలి మధుసూదన్‌రెడ్డి, కాసాని వెంకటేశ్వర్లు, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.



నల్లగొండలో తరుణ్‌చుగ్‌కు రాఖీ కడుతున్న మహిళా నాయకురాలు

పల్స శ్రీనుకు తరుణ్‌చుగ్ పరామర్శ

నకిరేకల్: పట్టణంలో ఇటీవల నిర్వహించిన నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిలో జరిగిన తోపులాటలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్‌ను ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ పరామర్శించారు. గురువారం ఆయన నల్లగొండ నుంచి సూర్యాపేటలో జరిగే పార్టీ సమావేశానికి వెళ్తున్న క్రమంలో నకిరేకల్‌లోని పల్స శ్రీను ఇంటికి వెళ్లి పరామర్శించి పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, జిల్లా ఇన్‌చార్జ్ ప్రదీప్‌కుమార్, స్థానిక నాయకులు మైల శ్రీనివాస్, నారగోని వెంకటేశ్వర్లు, జానయ్య తదితరులు ఉన్నారు.



పల్స శ్రీనును పరామర్శిస్తున్న తరుణ్‌చుగ్

డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలి



హాజరైన వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

నల్లగొండ: వచ్చే రెండు నెలల పాటు డెంగీ, సీజనల్ జ్వరాలు వ్యాపించనున్న నేపథ్యంలో వాటి నివారణకు వైద్యారోగ్య, దాని అనుబంధ శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. జ్వరంతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు డెంగీ రాపిడ్ కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. గురువారం నల్లగొండలోని కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీల వారీగా జ్వర కేసులు ఎన్ని వచ్చాయి, డెంగీ రాపిడ్ కిట్ టెస్ట్ ఎంత మందికి చేశారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పీహెచ్‌సీలకు డెంగీ రాపిడ్ టెస్ట్ కిట్‌లు సరఫరా చేశామన్నారు. బ్లడ్ శాంపిల్స్ పరిశీలించాక నిర్ధారణ అయిన తర్వాత డెంగీ పాజిటివ్ గా ప్రకటించాలన్నారు. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా టీమ్‌లు ఏర్పాటు చేసి దోమల నివారణ మందు ఫాగింగ్ చేయించాలన్నారు. అంగ వైకల్యం కలిగిన వారిని సదరం క్యాంపునకు వెళ్లేలా అవగాహన కలిగించాలన్నారు. ఈనెల 2వ తేదీ మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని సంబంధిత తేదీలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వెళ్లి వైకల్యం పరీక్షించుకోవాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో పలు అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉద్యోగులు కలెక్టర్‌కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండల్‌రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ మత్య, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు, మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'కుష్టు వ్యాధి' సర్వే

- జిల్లావ్యాప్తంగా 607 అనుమానితుల గుర్తింపు
- ఇప్పటికే 150 మందికి స్క్రీనింగ్ పూర్తి
- మొత్తంగా 16 పాజిటివ్ కేసుల నిర్ధారణ
- మరో ఇరవై రోజుల్లో మిగతా వారి స్క్రీనింగ్



మచ్చలను చూస్తున్న వైద్య సిబ్బంది

నల్లగొండ టౌన్: కుష్టువ్యాధి (లెప్రసీ) అనుమానిత కేసుల గుర్తింపునకు పక్షం రోజులుగా చేపట్టిన సర్వే ఎట్టకేలకు ముగిసింది. ఇందు కోసం వైద్యారోగ్య శాఖ జిల్లా వ్యాప్తంగా 1,464 బృందాల (ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల)ను నియమించి సర్వే చేయించింది. ఈ నెల 16న ప్రారంభించిన సర్వే గురువారంతో పూర్తయింది. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగిన సర్వే బృందాలు ప్రజలను కలిసి వారికి శరీరంపై ఏమైనా మచ్చలు ఉన్నాయా, కణుతులు ఉన్నాయా.. ఉంటే నొప్పి ఉంటుందా లేదా అనే తదితర అంశాలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు.

రోజూ 30 వేల ఇళ్లు..

ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచే వైద్య బృందాలు సర్వే ప్రారంభించాయి. దీంట్లో భాగంగా రోజూ సుమారును 30 వేల ఇళ్లను సందర్శించిన సర్వే బృందాలు లెప్రసీ కేసుల గుర్తించారు. ఇప్పటి వరకు 607 లెప్రసీ అనుమానితులను గుర్తించి ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులకు కేసుల వివరాలు పంపించారు. అందులో నేటి వరకు 150 మంది అనుమానిత కేసులను స్క్రీనింగ్ చేయగా 16 లెప్రసీ కేసులు బయటపడ్డాయి. వారిలో ఐదు మచ్చల వరకు ఉన్నవారికి ఆరునెలల కోర్సు మందులు, ఐదు నుంచి పది మచ్చలు ఉన్న వారికి 12 నెలల మందుల కోర్సును అందించేందుకు నిర్ధారించారు. మిగతా అనుమానిత వ్యక్తులను డాక్టర్ వద్దకు పంపించారు. వీరికి మరో ఇరవై రోజుల్లో స్క్రీనింగ్ చేసి లెప్రసీ ఉన్నది లేనిది నిర్ధారించి వారికి అవసరమైన మందులు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

లెప్రసీ నిర్ధారణ అయితే..

లెప్రసీ అని నిర్ధారణ అయిన వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేయడంతో పాటుగా క్రమం తప్పకుండా వారిని పర్యవేక్షణ చేయడం, మందులు పంపిణీ చేస్తూ వారికి భరోసా కల్పించనున్నారు. ప్రతి సంవత్సరం లెప్రసీ సర్వేను కొనసాగించడం ద్వారా ముందుగానే అనుమానితులను గుర్తించి వ్యాధిని ఆదిలోనే కట్టడి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెటుకుని ముందుకు సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,94,598 ఇళ్లను సర్వే చేశారు. 15,09,659 మందిని పరిశీలించి వారి వివరాలు నమోదు చేసుకున్నారు. మందులు సక్రమంగా వాడిన వారు ఏడాదిలోపు వ్యాధి నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుంది.

లెప్రసీ కేసుల గుర్తింపు సర్వే పూర్తి



లెప్రసీ సర్వే ద్వారా జిల్లా వ్యాప్తంగా 607 అనుమానిత కేసులను గుర్తించాం. అందులో 150 మందికి స్క్రీనింగ్ చేయడంతో 16 పాజిటివ్ కేసులు వచ్చాయి. వారికి అవసరమైన మందులు అందించి పర్యవేక్షిస్తున్నాం. మిగిలిన వారికి కూడా స్క్రీనింగ్ చేసి వ్యాధిని గుర్తించి మందులు ఉచితంగా అందజేస్తాం.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు,డీఎంహెచ్‌ఓ

హామీలు విస్మరించిన కేసీఆర్ సర్కార్

- మిర్యాలగూడలో ఇంటింటికీ గోడ గడియారాలు పంపిణీ చేస్తాం
- మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని మిర్యాలగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ ఆరోపించారు. గురువారం ఆయన దామరచర్లలో జరిగిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులపై అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులు బనాయిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారని వాపోయారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపిచేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఇంటికీ గోడ గడియారం పంపిణీ చేస్తామని ప్రకటించారు. సమావేశంలో కాంగ్రెస్ సీని యర్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం

మేళ్లచెరువు: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. గురువారం రాత్రి మేళ్లచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కర్నాటకలో ఇచ్చిన హామీలను అమలు చేసిందన్నారు. 2024లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కరరెడ్డి, సైదేశ్వరరావు, రామచంద్రయ్య, గోవిందరెడ్డి, బాబు, రంగశెట్టి సైదయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్

13న బహిరంగ వేలం

సూర్యాపేట: పాత మున్సిపల్ కార్యాలయం స్థానంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో 23 దుకాణాలకు నెలసరి అద్దె ప్రతిపాదికన మూడేళ్ల పాటు కేటాయించేందుకు ఈనెల 13న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఈనెల 12వ తేదీ సాయంత్రం వరకు అవకాశం ఉంటుందని, రూ.50వేలను కమిషనర్, సూర్యాపేట మున్సిపాలిటీ పేరున డీడీ తీసి దరఖాస్తుకు జతపర్చాలని సూచించారు. దుకాణాలకు సంబంధించిన వివరాలు, రిజర్వ్, అన్ రిజర్వ్ దుకాణాలు, అద్దె తదితర వివరాలు మున్సిపల్, ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ఉంచినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీలో రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలు

- రెడ్డి కాలనీలో నిత్యం ట్రాఫిక్ జామ్
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని సంబంధిత అధికారులు
- స్థానికులకు తప్పని ఇబ్బందులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని సాగర్ ప్రధాన రోడ్డు నుంచి రెడ్డికాలనీ ఆర్బీ వరకు నిత్యం రద్దీగా ఉంటుంది. రెడ్డికాలనీలో ఒక వైపు వైన్స్, మరో వైపు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఉంది. నర్సింగ్ కళాశాల కూడా పక్కనే ఉంది. వైన్స్‌కు వచ్చే మద్యం ప్రియులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటరుకు వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో ఆ దారిగుండా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ): డీసీఎం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం తిప్పర్తి మండలంలోని సిలార్‌మియాగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిలార్‌మియాగూడేనికి చెందిన పోకల జానయ్య(43) బోర్‌వెల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడు గురువారం తెల్లవారు జామున గ్రామ సమీపంలో మిర్యాలగూడ రోడ్డు వైపు బహిర్భూమికి వెళ్లి తిరిగి నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్ వెంట ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న డీసీఎం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన జానయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. జానయ్యకు భార్య జానకమ్మ, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపారు.

సైదులు మృతిపై పోలీసులకు ఫిర్యాదు

కనగల్: మునుగోడు మండలంలోని దుబ్బ కాల్వకు చెందిన దండు సైదులు బుధవారం కనగల్ మండలంలోని దోరెపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనం పైనుంచి పడి మృతిచెందాడు. వాగులో వేసిన చేతిపంపు ఇరుక్కుపోవడంతో దానిని బయటకు తీసేందుకు దోరెపల్లి గ్రామ ఉప సర్పంచ్ దాసరి వెంకన్న సైదులును పిలిపించగా.. పని ముగించుకుని ఇద్దరూ తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ పైనుంచి పడి సైదులు మృతిచెందాడు. కాగా సైదులు మృతిపై తమకు అనుమానాలు ఉన్నట్లు అతడి బంధువులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆరు గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

పెద్దఅడిశర్లపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆరు గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఘనపురం ఎక్స్‌రోడ్డు వద్ద కోదాడ–జడ్చర్ల హైవేపై గురువారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ గొర్రెల కాపరి కొన్నిరోజుల క్రితం మేత కోసం తన గొర్రెలను పెద్దఅడిశర్లపల్లి మండలానికి తీసుకొచ్చాడు. గురువారం రాత్రి అతడు గొర్రెల మందతో సొంతూరుకు తిరుగు ప్రయాణమవ్వగా.. ఘనపురం స్టేజీ సమీపంలో కోదాడ–జడ్చర్ల హైవేపై ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఆరు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేంద్ర, రాష్ట్రాలపై పోరాటం ఉధృతం

ఆలేరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు సీపీఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, సీపీఎం యాదాద్రి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తెలిపారు. గురువారం ఆలేరులో నిర్వహించిన సీపీఐ, సీపీఎం ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 2014 ఎన్నికల సమయంలో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందన్నారు. ఖాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, నిజామాబాద్‌లో పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ, రాష్ట్రంలో మూడు ఎయిర్ పోర్టులు, చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేస్తామని చెప్పి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం ప్రకారం 11.5 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇస్తామని కేవలం నాలుగు లక్షల ఎకరాలకు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు. దళితులు, గిరిజనులకు మూడు ఎకరాల భూమి ఊసే లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఐలి సత్తయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మంగ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

● పెళ్లిలో రక్షాబంధన్


నల్లగొండలో గురువారం జరిగిన ఓ పెళ్లిలో పెళ్లికొడుకైన తన తమ్ముడికి రాఖీలు కడుతున్న సోదరీమణులు - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ


చిలుకూరు: మండల కేంద్రంలో గురువారం జరిగిన మరీదు ఉపేందర్ పెళ్లిలో అతడికి రాఖీ కడుతున్న చెల్లెలు లలిత

● పెంపుడు పిల్లికి రాఖీ


నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో ఓ ఇంట్లో పెంపుడు పిల్లికి రాఖీ కడతున్న చిన్నారులు

● మొక్కవోని బంధం


నల్లగొండ పట్టణంలోని యాటకన్నారెడ్డి కాలనీలో తమ ఇంట్లోని చెట్లకు రాఖీ కడుతున్న చిన్నారి - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

● రాఖీ కట్టి.. హెల్మెట్ అందించి


రామన్నపేట: మండలంలోని కక్కిరేణికి చెందిన సామాజిక కార్యకర్త వేముల సైదులుకు రాఖీ కట్టి హెల్మెట్ అందజేస్తున్న అతడి చెల్లి స్వాతి

చెరువులో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

భువనగిరి: ఈతకు వెళ్లి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని బెస్తవాడకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ఎంకర్ల అనిల్‌కుమార్(42) గురువారం పట్టణ శివారులోని పెద్దచెరువు వద్దకు వెళ్లాడు. ఈత కోసం చెరువులోకి వెళ్లగానే ఊపిరి ఆడక నీట మునిగాడు. స్థానికులు గమనించి చెరువులోకి దూకి అనిల్‌కుమార్‌ను చెరువు కట్ట వద్దకు తీసుకురాగా.. అప్పటికే అతడు మృతిచెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సుధీర్‌కృష్ణ తెలిపారు. మృతుడు హైదరాబాద్‌లోని చెంగిచెర్ల డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు మూడు నెలల క్రితం ఉద్యోగం నుంచి సస్పెండ్ అయ్యాడని, తిరిగి శుక్రవారం నుంచి విధులకు హాజరుకావాల్సి ఉందని తెలుస్తోంది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్


పోలీసుల అదుపులో గంజాయి విక్రయిస్తున్న యువకులు

యాదగిరిగుట్ట: పట్టణంలో గంజాయి విక్రయించడానికి యత్నించిన ముగ్గురు యువకులను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ రమేష్ వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని అంగడిబజార్‌లో గురువారం హైదరాబాద్‌కు చెందిన వంశీతేజ, యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన నరేష్, శ్రీకాంత్‌లతో కలిసి స్థానికంగా కొందరి వ్యక్తులకు గంజాయి అమ్మడానికి ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న యాదగిరిగుట్ట పట్టణ పోలీసులు అంగడిబజారులో ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ముగ్గురు యువకుల వద్ద ఉన్న 45 గ్రాముల గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు, పాల వ్యాన్ ఢీ.. ఐదుగురికి గాయాలు


ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కారు


బోల్తా పడిన పాల వ్యాన్

పెద్దఅడిశర్లపల్లి: కారు, పాల వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు దాటిన తర్వాత గురువారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన బిజిలి వంశీ, మానపాటి మహేష్, నల్లగొండ నాగరాజు, కందుల క్రాంతి, ఎలగొండ సతీష్ హైదరాబాద్‌కు కారులో బయల్దేరారు. మార్గమధ్యలో పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు దాటిన తర్వాత దేవరకొండ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న పాల వ్యాన్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.7.50 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

మేళ్లచెరువు: చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను కోదాడ పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ గురువారం కోదాడ డీఎస్పీ ప్రకాశ్‌తో కలసి మేళ్లచెరువు పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం పెద్దగొన్నూరు గ్రామానికి చెందిన గుబిలి సుబ్రహ్మణ్యం చిన్నతనం నుంచే పేకాట, మద్యానికి అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. అతడిపై ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, భీమవరం, కలిదిండి, కైకలూరు, ముదినేపల్లి, పామర్రు, జగ్గయ్యపేట, ఉయ్యూరు, పెడన, బంటుమిల్లితో పాటు తెలంగాణలోని సూర్యాపేట తదితర పోలీస్ స్టేషన్‌లలో 45 వరకు దొంగతనం, హత్యాయత్నం కేసులు ఉన్నాయి. ఆయా కేసుల్లో అతడు పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. కాగా ఈ నెల 26న సుబ్రహ్మణ్యం కోదాడ టౌన్‌లోని పలు ఇళ్లలో చోరీ చేసేందుకు యత్నించి విఫలమయ్యాడు. కోదాడ టౌన్‌లోని సూర్యాపేట రోడ్డులో బెల్లంకొండ రఘు ఎలక్ట్రికల్ షాపు నడిపిస్తూ దుకాణం పైనే మూడో అంతస్తులో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. 27న రఘు కుటుంబ సభ్యులతో కలిసి ఫంక్షన్‌కు వెళ్లగా.. అర్ధరాత్రి సమయంలో సుబ్రహ్మణ్యం మూడో అంతస్తుకు వెళ్లి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.9.50 లక్షల నగదు ఎత్తుకెళ్లాడు. ఇంటికి వచ్చిన తర్వాత చోరీ జరిగినట్లు గుర్తించిన రఘు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా గురువారం ఉదయం కోదాడ పట్టణ సీఐ రాము, ఎస్‌ఐలు రామాంజనేయులు, యాదవేంద్రరెడ్డి కోదాడ పట్టణంలో పెట్రోలింగ్ చేస్తుండగా ఎల్‌ఐసీ ఆఫీస్ వద్ద సుబ్రహ్మణ్యం అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. విచారణలో భాగంగా రఘు ఇంట్లో చోరీ చేసిన నగదులో రూ.2లక్షలను పేకాటలో పోగొట్టుకున్నట్లు నిందితుడు తెలిపాడు. మిగిలిన రూ.7.50 లక్షలను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. దొంగను పట్టుకున్న కోదాడ టౌన్ సీఐ రాము, ఎస్‌ఐలు రామాంజనేయులు, యాదవేంద్రరెడ్డి, పోలీసు సిబ్బంది యల్లారెడ్డి, సతీష్‌నాయుడును ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

న్యాయం చేయాలని వివాహిత నిరసన


తన పిల్లలతో కలిసి నిరసన తెలుపుతున్న భాగ్యలక్ష్మి

భువనగిరి: మాయమాటలు చెప్పి తన జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తితో వివాహం జరిపించి తనకు న్యాయం చేయాలని వివాహిత నిరసన తెలిపింది. ఈ ఘటన గురువారం భువనగిరి మండలంలోని గోకారంలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... భువనగిరి మండలంలోని జాలుకాల్వకు చెందిన పల్లపు భాగ్యలక్ష్మికి ఆలేరు పట్టణానికి చెందిన పల్లె రమేష్‌తో 2014లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గోకారం గ్రామానికి చెందిన దేశపాక పరమేష్‌తో భాగ్యలక్ష్మికి పాఠశాలలో చదువుకున్నప్పటి నుంచి చనువు ఉండడంతో 2017లో అత్తింటి వారు ఆమెను ఇంటి నుంచి పంపించేశారు. దీంతో బతుకుదెరువు నిమిత్తం భాగ్యలక్ష్మి చౌటుప్పల్‌లో ఉంటుంది. కాగా పరమేష్ చౌటుప్పల్‌లో ఉంటున్న తన వద్దకు మానసికంగా, శారీరకంగా హింసించాడని బాధితురాలు పేర్కొంది. తన వారిని దూరం చేసి తన జీవితాన్ని ఆగం చేసిన పరమేష్‌తో తనకు వివాహం జరిపించి పెద్దలు న్యాయం చేయాలని గురువారం గోకారం గ్రామంలో పరమేష్ ఇంటి ఎదుట తన పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపింది. తనకు, తన పిల్లలకు న్యాయం జరగకపోతే మరణమే శరణ్యమని బాధితురాలు వాపోయింది.

సేంద్రియ ఎరువులతో భూసారం పెరుగుతుంది


రైతులకు జీవ ఎరువులు అందజేస్తున్న కేవీకే మృత్తికా శాస్త్రవేత్త కిరణ్

గరిడేపల్లి: రైతులు సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా భూసారం పెరుగుతుందని, దీంతో మంచి దిగుబడి పొందవచ్చని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం మృత్తికా శాస్త్రవేత్త కిరణ్ తెలిపారు. గురువారం పరెడ్డిగూడెం గ్రామంలో వాళ్లబుదాస్ సైదులు సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంలో జిగురు అట్టలు, సోలార్ దీపాలు, ట్రైకోడెర్మా, సూడోమోనాస్‌ను ఉపయోగించి చీడపీడలను నియంత్రించవచ్చన్నారు. అనంతరం రైతులకు జీవ ఎరువులను అందజేశారు. కార్యక్రమంలో రైతులు ఏసు, నర్సింహారావు, పద్మ తదితరులున్నారు.

డ్యూటీలో ఉన్న తమ్ముడికి రాఖీ కట్టిన అక్క


మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లోనే డ్యూటీలో ఉన్న తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క యశోద

మిర్యాలగూడ టౌన్: రాఖీ పండుగను పురస్కరించుకొని తిప్పర్తి మండలం రామలింగాలగూడెం గ్రామానికి చెందిన యశోద గురువారం తన కుమారుడితో కలిసి మిర్యాలగూడలోని శాంతినగర్‌లో నివాసముంటున్న తన తమ్ముడి ఇంటికి రాఖీ కట్టేందుకు వచ్చింది. కాగా మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న యశోద తమ్ముడు వి. సత్యనారాయణ ఉదయమే డ్యూటీకి వెళ్లాడు. దీంతో యశోద తన తమ్ముడికి ఫోన్ చేయగా.. మిర్యాలగూడ బస్టాండ్ నుంచి బస్సులో నల్లగొండకు వెళ్తున్నానని చెప్పాడు. ట్రిప్ ముగించుకొని వస్తానని చెప్పగా.. తమ్ముడు నల్లగొండకు వెళ్లి తిరిగి వచ్చేంత వరకు కూడా స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోనే యశోద వేచి చూసింది. ట్రిప్ ముగించుకొని డిపోకు వచ్చిన తర్వాత తమ్ముడికి వెంటనే బొట్టు పెట్టి రాఖీ కట్టి స్వీటు తినిపించింది. అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధాలను చూసి అక్కడున్న ప్రయాణికులు మురిసిపోయారు.

ఫేస్‌బుక్‌లో పరిచయమైన స్నేహితుడికి రాఖీ..


ఫేస్‌బుక్‌లో పరిచయమైన లాల్‌మదార్‌కు రాఖీ కడుతున్న శ్రీవాణి

హుజూర్‌నగర్‌రూరల్: ఫేస్‌బుక్‌లో పరిచయమైన స్నేహితుడికి రాఖీ కట్టింది ఓ మహిళ. వివరాలు.. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన షేక్ లాల్‌మదార్ మెదక్ జిల్లాలోని నర్సాపూర్ సీఐగా పని చేస్తున్నాడు. అతడికి వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన శ్రీవాణితో 6సంవత్సరాల క్రితం ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. లాల్‌మదార్‌కు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తోబుట్టువులు ఎవరూ లేరు. దీంతో లాల్‌మదార్ ఫేస్‌బుక్‌లో పరిచమైన శ్రీవాణిని తన తోబుట్టువుగా భావించడంతో.. గత 5 సంవత్సరాలుగా ఆమె ప్రతి ఏడాది రాఖీ పండుగకు బూరుగడ్డ గ్రామానికి వచ్చి లాల్‌మదార్‌కు, అతడి తమ్ముడు అలీపాషాకు రాఖీ కడుతోంది. గురువారం కూడా రక్షాబంధన్ సందర్భంగా శ్రీవాణి బూరుగడ్డకు వచ్చి లాల్‌మదార్‌కు రాఖీ కట్టింది.

కర్రలతో దాడి కేసులో ఏడుగురికి జైలు శిక్ష

మిర్యాలగూడ టౌన్: కర్రలతో దాడి చేసిన కేసులో ఏడుగురికి జైలు శిక్ష విధిస్తూ గురువారం మిర్యాలగూడ ఒకటవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ టీఎస్ఎన్ సుమబాల తీర్పు వెలువరించారు. వివరాలు.. 2017లో పాత కక్షలను మనసులో పెట్టుకొని మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన దండగల రాములమ్మ, వేముల సైదమ్మ, రవిపై అదే కాలనీకి చెందిన వేముల రాములమ్మ, ఆంజనేయులు, స్వప్న, గుంజ రాములు, పులి రాజు, గుంజ సతీష్, గుంజ రమణ కళ్లల్లో కారం చల్లి కర్రలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్‌ఐ డి. విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు గురువారం విచారణకు రాగా.. నిందితులపై నేరం రుజువు కావడంతో వేముల రాములమ్మ, ఆంజనేయులు, స్వప్న, గుంజ రాములుకు నెల రోజులు జైలు శిక్ష విధించగా.. పులి రాజు, గుంజ సతీష్, గుంజ రమణపై నేరం మూడు నెలలు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ మిర్యాలగూడ ఒకటవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ టీఎస్ఎన్ సుమబాల తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సుధాకర్ వాదించగా, ఆయనకు కోర్టు కానిస్టేబుల్ పెద్ది రాజు సహకరించారు.

నాటుడు.. నరుకుడు!

- భువనగిరిలో రహదారుల వెంట చెట్ల తొలగింపు
- కరెంట్ తీగలకు అడ్డొస్తున్నాయని నరుకుతున్న సిబ్బంది
- మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం
- మంత్రి కేటీఆర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి


రోడ్డు పక్కన విద్యుత్ సిబ్బంది నరికిన చెట్లు

భువనగిరి టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో రహదారుల వెంబడి ఒక శాఖ వారు మొక్కలు నాటితే మరో శాఖ వారు నరుకుతూ పోతున్నారు. కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్నాయని గురువారం విద్యుత్ సిబ్బంది ఎదుగుతున్న మొక్కలను నరికివేయడం వివాదానికి దారి తీసింది. అకారణంగా చెట్లను తొలగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏం జరిగిందంటే..

భువనగిరి పట్టణంలో కొంతకాలంగా ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. పట్టణ సుందరీకరణలో భాగంగా మున్సిపల్ అధికారులు రోడ్డుకు ఇరువైపులా తొమ్మిది నెలల క్రితం ప్రత్యేకంగా మొక్కలు నాటి పెంచుతున్నారు. ఒక్కో మొక్కకు రూ.2 వేల వరకు ఖర్చు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డబ్బులు వెచ్చించి మొక్కలు నాటి పెంచుతుంటే మరో వైపు విద్యుత్ సిబ్బంది వాటిని ఎదిగే క్రమంలో నరికి వేస్తున్నారు. గతంలోనూ రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని నరికివేశారు. దీంతో అప్పటి కలెక్టర్ పమేలా సత్పతి ఆ శాఖ డీఈకి నోటీసులు కూడా జారీ చేశారు. గురువారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న 10 మొక్కల వరకు నరికివేశారు.

విద్యుత్ అధికారులపై ఆగ్రహం

విద్యుత్ సిబ్బంది చెట్లను నరుకుతుండగా అదే సమయంలో ఆ ప్రాంతంలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు చూశారు. తక్షణమే అక్కడికి వెళ్లి చెట్లను ఎందుకు నరుకుతున్నారని లైన్‌మన్‌ను ప్రశ్నించగా విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు చెప్పారు. వెంటనే సంబంధిత అధికారులకు మున్సిపల్ చైర్మన్ ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ సుందరీకరణ కోసం వేల రూపాయలు వెచ్చించి మొక్కలు నాటి పెద్ద చేశామని, అనుమతి తీసుకోకుండా ఎలా నరుకుతారని ప్రశ్నించారు. మరోసారి తమకు సమాచారం ఇవ్వకుండా చెట్లను నరికితే సహించబోమన్నారు. ఈ విషయమైన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు.

'బస్వాపురం' పనుల పరిశీలన


భువనగిరి: మండలంలో బస్వాపురం రిజర్వాయర్ పనులను గురువారం యాదాద్రి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పరిశీలించారు. రిజర్వాయర్ కోసం మొత్తం సేకరించాల్సిన భూమి, ఇప్పటి వరకు సేకరించింది, ఎంత మంది నిర్వాసితులున్నారని తెలుసుకున్నారు. ముంపు గ్రామాల తరలింపు గురించి అధికారుల ద్వారా ఆరా తీశారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సూచించారు. ఆయన వెంట ఈఈ ఖుర్షీద్, తహసీల్దార్ అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

సాలీళ్లు, మిడతలు.. పంటలకు హితకారులు




సాలీడు


మిడత


సందీప్‌కుమార్, ఏవో, పెద్దవూర

పెద్దవూర: పంటలలో వచ్చే పురుగులకు సహజ శత్రువులుగా భక్షిక సాలీళ్లు ఉన్నాయన్న విషయం చాలామంది రైతులకు తెలియదు. సహజ శత్రువులుగా పిలిచే ఈ కీటకాలను రైతు మిత్రులు, పంట రక్షిణులు, పంట కాపరులు పిలుచుకుంటుంటారు. బస్తాల కొద్దీ రసాయనిక మందుల్ని పంట పొలాల్లో గుమ్మరించటం వలన ఇవి కనుమరుగై దుష్ఫలితాలు ఏర్పడతాయని మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు.

- అక్షంతల పురుగులు: నెమ్మదిగా సంచరించే పురుగులను ఇవి వేలాదిగా తింటాయి. బయటకు కనిపించే వివిధ జాతి శత్రు పురుగుల గుడ్లను కబళిస్తాయి. ఇవి చురుగ్గా కదులుతూ పిల్ల గొంగళి పురుగులు, పచ్చదోమ పిల్ల పురుగులు, కన్పించే గుడ్లను భక్షిస్తాయి. ఇది పచ్చదోమ, సుడిదోమ పిల్లలను ప్రీతిగా తింటుంది. వీటి పిల్ల పురుగులూ అతి తిండిపోతులుగా చెప్పవచ్చు.
- తూనీగలు: పెద్ద, చిన్న తూనీగలు రంగురంగుల ఉలిపిరి రెక్కలతో మొక్కల పైభాగమునకు దిగువగా ఎగురుతూ ఎగిరే కీటకాలు, దోమ పిల్లల కోసం వెదుకుతూ ఉంటాయి. వీటి పిల్ల పురుగులు నీటిలో ఆవాసం ఉంటాయి. వరి కాండం పై సులభంగా సంచరిస్తూ పిల్ల దోమలను వేటాడుతాయి.
- భక్షక మిడత: ఎదిగిన పైరులో రాత్రి వేళల్లో చురుగ్గా సంచరించి కాండం తొలిచే పురుగు గుడ్లు, వరి నల్లనల్లి గుడ్లు, పచ్చదోమ, సుడిదోమ పిల్లల్ని కబళిస్తుంది. యవ్వన మిడతలు అమితమైన చురుకుదనంతో అలికిడి విన్నంతనే వెంటనే ఎగిరిపోతాయి. ఒక్కో భక్షక మిడత రోజుకు 3, 4 కాండం తొలిచే పురుగుల గుడ్ల సముదాయాల్ని భక్షించగలదు.
- సాలీళ్లు: వరిని ఆశించి నష్టపరిచే వివిధ రకాల సాలీళ్లు అన్ని రకాల శత్రు పురుగులనూ ఇవి తింటూ ఉంటాయి. దీపపు పురుగులు, ఆకులను తినే గొంగళి పురుగులు, కాండం తొలుచు పురుగు, పెద్ద రెక్కల సీతాకోక చిలుకలను, ఉల్లికోడు, వరి ఈగలను, రెల్లరాల్చు పురుగు, సుడి దోమలను ఎంతో సులువుగా, మక్కువగానూ భక్షిస్తాయి. లభ్యమయ్యే శత్రు కీటక సంఖయ పరిమాణమును అనుసరించి ఒక్కో సాలె పురుగు 5–15 వరకూ శత్రు కీటకాలను ఒక రోజులో తినగలదు.
- తోడేలు సాలీడు: వరి పిలకల దశలో ఈ జాతి సాలీళ్లు ఎక్కువగా మొదళ్ల మధ్య సంచరిస్తాయి. మాగాణి భూములు, మెట్ట వరి పొలాల్లో శత్రు పురుగులపై దాడి చేసి నష్టపరిచే స్థాయికి వాటిని ఎదగకుండా అదుపు చేస్తాయి.
- శివంగి సాలీడు: కొత్త తరం పెంపొందకుండా శత్రు పురుగులను నివారించటంలో ప్రధాన భూమికను పోషిస్తుంది.
- దుమికే సాలీడు: చుట్టుకుపోయిన ఆకులోనే చిన్నపాటి గూడును ఏర్పరచుకుని మరో ఆకును కూడా అల్లుకుని దాక్కుని, దీపపు పురుగుల కోసం నిరీక్షిస్తుంది. అదును దొరికాక సంహరిస్తుంది. ఇతర పిల్ల పురుగులను కూడా ఇవి కబళిస్తాయి.
- పొట్టి సాలీడు: ఈ సాలీళ్లు నీటి మట్టము పైన వరి పిలకల మొదళ్ల మధ్య నల్లి గూళ్లలో చిక్కిన పచ్చదోమ, సుడిదోమ పిల్లలను ఆరగిస్తాయి.